ప్రజాశక్తి

శుక్రవారం 10 అక్టోబర్ 2025   8 పేజీలు



గుంటూరు



పల్నాడు

డిఎస్‌సి కౌన్సెలింగ్‌లో గందరగోళం

- తొలిరోజు పాక్షికంగా వెబ్ ఆప్షన్‌ల నమోదు
- కొన్ని ఖాళీలనే చూపుతున్నారంటున్న అభ్యర్థులు
- టిజిటి, పిజిటి, స్కూల్ అసిస్టెంట్లకు గ్రీన్ సిగ్నల్
- ఎస్‌జిటిలకు మాన్యువల్‌గా చేయాలని నిర్ణయం
- నేటి రాత్రిలోగా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిఎస్‌సి ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు పాఠశాలలో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. ఉపాధ్యాయులుగా ఎంపిక వారికి శిక్షణ పొందుతున్న కేంద్రాల్లోనే గురు, శుక్రవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి శుక్రవారం రాత్రి కల్లా అభ్యర్థులందరికీ అప్పాయింట్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా అనుకున్న నిర్ణయించిన విధంగా గురువారం ఉదయం 10 గంటలకు అన్ని పోస్టులకు వెబ్ ఆప్షన్‌లు నమోదు కాలేదు. టిజిటి, పిజిటిలకు వెబ్ ఆప్షన్‌ల నమోదు ప్రక్రియ నమోదులో కూడా బాగా జాప్యమైంది. వెబ్ ఆప్షన్‌ల నమోదులో కొంతమంది అభ్యర్థులు తడబడ్డారు. తొలుత వారికి కోరుకున్న ప్రదేశంలో ఉద్యోగం వస్తుందని ఆశించారు. కానీ ఆయా ప్రాంతాల్లో అధికారులు ఖాళీలు

2లో



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న గుంటూరు, పల్నాడు డిఇఒలు

మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ యాజమాన్యాలలో సెలెక్ట్ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నరసరావుపేటలోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో శిక్షణ కేంద్రంలో గురువారం రాత్రి మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయుల సీనియార్టీ ప్రాతిపదికన పోస్టులను కోరుకున్నారని అధికారులు తెలిపారు. ఉమ్మడి గుంటూరు డిఈవో సి.వి.రేణుక, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మండల పరిషత్, ప్రభుత్వ యాజమాన్యంలోని సెలెక్ట్ అయిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నరసరావుపేట రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌లో పల్నాడు డిఈవో కార్యాలయ ఏడీ పివి రమణ, మండల విద్యాశాఖ అధికారులు బ్రహ్మేశ్వరరావు, ఎమ్‌డి ఖాసిం, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



పల్నాడు డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

నేటి నుండి బోధనేతర పనుల బహిష్కరణ

- సామాజిక బాధ్యతగానే చేస్తున్నామన్న ఫ్యాప్టో నాయకులు
- పల్నాడు డిఇఒ చంద్రకళకు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మినహా ఇతర బోధనేతర పనులను శుక్రవారం నుండి ఉపాధ్యాయులం బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డిఇఒ చంద్రకళకు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో పల్నాడు జిల్లా డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎం.మోహన్ రావు మాట్లాడుతూ బోధనేతర పనులు చేయకూడదని ఈనెల 7న విజయవాడలో జరిగిన 'పోరుబాట' కార్యక్రమంలో ఫ్యాప్టో పిలుపునిచ్చిందని చెప్పారు. వివిధ రకాల సమాచారాన్ని సేకరించే యాప్‌లో నమోదు వంటి పనులు ఇకపై చేయబోమన్నారు. యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతూ బోధనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేక పోతున్నారని, సామాజిక బాధ్యతగానే యాప్‌ను బహిష్కరిస్తున్నామని అన్నారు. దీనిద్వారా బోధన ప్రమాణాలు మరింత మెరుగుపడుతుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్, చంద్రజిత్ యాదవ్, కె.శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వర్లు, కరిముల్లా, భీష్మారావు, కె.వీరాంజనేయులు, ఏడుకొండలు, రామయ్య, నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చోరీ కేసుల్లో దంపతుల అరెస్టు

13 చోట్ల దొంగతనాలు - భారీగా ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న కేసులో యువ దంపతులను కొల్లిపర పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. కొల్లిపరకు చెందిన 27 ఏళ్ల కటారి వెంకటేశ్వర్లు, అతని భార్య 24 ఏళ్ల తేజ నాగమణి కలిసి దాదాపు 13 ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. గత నెల 28న కొల్లిపర మండలం తూములూరుకు చెందిన మాటూరి మధుసూధనరావు కుటుంబం వేరే ఊరు వెళ్లింది. వారు తిరిగి రాగానే ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించి కొల్లిపర పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేయగా కటారి వెంకటేశ్వర్లు చోరీలకు పాల్పడటాన్ని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మధుసూధనరావు ఇంట్లో దొంగతనానికి పాల్పడినట్లు వెంకటేశ్వర్లు ఒప్పుకోవడంతో పాటు, గతంలో కూడా కొల్లిపర మండలంలోని వివిధ గ్రామాల్లో 13 దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన సొత్తులో కొంత భాగం తన భార్యకు ఇవ్వగా ఆమె దాచినట్లు చెప్పడంతో ఇద్దర్నీ పోలీసులు అరెస్ట్ చేశారు. వెంకటేశ్వర్లు తన ద్విచక్ర

2లో



సిజెఐపై దాడికి మతతత్వ వాదుల అండ

కెవిపిఎస్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి- తాడేపల్లి

చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని అందరూ ఖండించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. ఈ మేరకు ప్రకాష్ నగర్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట గురువారం జరిగిన నిరసనలో మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మనువాద భావజాలం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులో ఒక మతోన్మాది ఆ విధంగా వ్యవహరించడం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ తదితర మతతత్వవాదుల అండ దాగుందని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు తమకు 400 ఎంపీ సీట్లు ఇస్తే భారత రాజ్యాంగం మారుస్తామని మద్దతు పలికిన శక్తుల కుట్రల నేపథ్యంలో ఈ ఘటనను చూడాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగానికి పెను ప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య మూలాలను బతికించుకుంటేనే దేశం మనుగడ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు బి.వెంకటేశ్వర్లు, వి.దుర్గారావు, బి.ప్రభాకర్, వి.శాస్త్రి, ఎన్.దుర్గా రావు, వై.నరసింహారావు, లెనిన్ పాల్గొన్నారు.

డిఎస్‌సి కౌన్సెలింగ్‌లో గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

చూపలేదు. దీంతో తొలిరోజు పాక్షికంగా వెబ్ ఆప్షన్‌ల నమోదయ్యాయి. కొన్ని ఖాళీలనే చూపుతున్నారంటున్న అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. టిజిటి, పిజిటి, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ ఆప్షన్‌లను ప్రకటించారు. ఎస్‌జిటిలకు మాన్యువల్‌గా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిఎస్‌సిలో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు సీనియారిటీ జాబితా ప్రకటించలేదని విమర్శలు వచ్చాయి. వెబ్ ఆప్షన్స్ స్వేచ్ఛగా పెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా ట్రైనింగ్స్ సెంటర్లోనే పెట్టాలని తప్పనిసరి చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఖాళీలన్నీ చూపకుండా కొన్ని ఖాళీలను బ్లాక్ చేయడంపై ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు తొలుత వెనుకబడిన ప్రాంతాలు, అసలు ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించినట్టు చెబుతూ వచ్చిన అధికారులు ఆకస్మికంగా గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలో దాదాపు 25 ఖాళీల భర్తీకి ఆప్షన్‌లను ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. అయితే డిఎస్‌సి ద్వారా ఎంపిక చేసిన 1140 మంది ఉపాధ్యాయులతో పాటు జోన్-3 కింద మోడల్ స్కూళ్ల కోసం ఎంపికైన మరో 572 ఖాళీలనే చూపుతామని అధికారులు తెలిపారు.

నిబంధనల ప్రకారమే కౌన్సెలింగ్ : డిఈవో రేణుక

ఒక అభ్యర్థికి ఒక ఖాళీ చొప్పునే కౌన్సెలింగ్‌లో చూపాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక ప్రజాశక్తికి తెలిపారు. నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ జరుగుతుందని, గందరగోళానికి తావులేదని అన్నారు. ఎస్‌జిటిలకు శుక్రవారం మ్యాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. గురువారం సాయంత్రం నరసరావుపేటలో జరుగుతున్న శిక్షణా కేంద్రాలకు వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు వివిధ రిజర్వ్ కేటగిరితో పాటు మెరిట్‌కం రోస్టర్ పాయింట్‌ల ద్వారా కౌన్సెలింగ్ చేపట్టామన్నారు. కౌన్సెలింగ్‌లో ఆయా పాఠశాలలకు ఎంపికైన ఉపాధ్యాయులకు శుక్రవారం రాత్రిలోగా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.ఉమశ్రీ

కల్తీ మద్యం తయారీదార్లపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కల్తీ మద్యం తయారుచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణ కార్యదర్శులు జి.రజిని, జి.ఉమశ్రీ అన్నారు. ఐద్వా పల్నాడు జిల్లా సమావేశం జె.అనూష అధ్యక్షతన స్థానిక పుతుంబాక భవన్‌లో గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గంజాయి, గుట్కా బారినపడి యువత జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై ప్రభుత్వం నియంత్రణ విధించాలన్నారు. సమావేశంలో డి.విమల, పార్వతి, ఎం.జ్యోతి, షేక్ నాసర్‌బి, కె.సుధారాణి పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నరేష్ కుమార్

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ ముద్దుల నరేష్ కుమార్ తెలిపారు. నరసరావుపేట పట్టణం రెడ్డినగర్‌లోని కళాశాలలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక తాడికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించగా తమ విద్యార్థులు జి.జ్ఞాన కుమార్, డి.శ్రావణి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల వినుకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారి అభినందన సభలో విద్యార్థులతోపాటు పీడీ వై.సురేష్‌ను కళాశాల చైర్మన్ ముద్దుల కోటేశ్వరరావు వైస్ చైర్మన్ నర్రా శేషగిరిరావు, డైరెక్టర్లు నల్లపాటి శ్రీకాంత్, భవిరిశెట్టి మదన రాజారావు, ప్రిన్సిపల్ శివనాగేశ్వరరావు అభినందించారు.

చోరీ కేసుల్లో దంపతుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

వాహనంపై తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, ఇనుపరాడ్డుతో తలుపులు పగులగొట్టి ఆభరణాలు, నగదు లాంటి విలువైన వస్తువులను దొంగిలించేవాడు. నేరం చేసిన తర్వాత కూడా అదే ఊరిలో సాధారణంగా తిరుగుతూ ఎవరికి అనుమానం రాకుండా వ్యవహరించేవాడు. నిందితుడి నుండి వాహనంతోపాటు 173.19 గ్రాముల బంగారం, 226.36 గ్రాముల వెండి, రూ.2,15,000 నగదు, ఒక టీవీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి జనార్ధనరావు ఆధ్వర్యంలో తెనాలి రూరల్ సిఐ ఉమేష్, కొల్లిపర ఎస్ఐ కోటేశ్వరరావు నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సిఐ, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్ రామకోటేశ్వరరావు, మురళీకృష్ణ, పోలీస్ కానిస్టేబుల్స్ కూర్మారావు, శివరామకృష్ణను ఎస్‌పి అభినందించి రివార్డులు అందించారు.



టిటిడి పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తిరుమల తిరుపతి దేవస్థానం సంబంధించిన ఎనిమిది అంశాలు ఆడిట్‌పై ఆలయ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరితో కలిసి పబ్లిక్ అకౌంట్స్ అడిట్‌లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు పాల్గొన్నారని ఆయన కార్యాలయం గురువారం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. ఇంటర్నల్ ఆడిట్, ఆలయ నిధులు, డిపాజిట్లు, ఇటీవల జరిగిన అభివృద్ధి పనులు, పునరావృతం, సిజిఎఫ్ నిధులకు వినియోగం, ఆస్తులు లేని ఆలయాలు, గ్రామ దేవతలకు ఆర్థిక సాయం, ఆలయం అభివృద్ధి చేయవలసిన ఆర్థికసాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాలు పున నిర్మాణంపై టిటిడి తీసుకున్న నిర్ణయాల అమలు, ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు జీవనోపాధి, ఇటీవలకు వెలుగు లో వచ్చిన ఆలయ హుండీలు నిధుల స్వాహాకు పాల్పడిన రవికుమార్ వ్యవహారం తదితర అంశాలపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరయ్యారు.

పకడ్బందీగా దాచినా చోరీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



బంగారం, నగదు పోయిందనే ఫిర్యాదుపై ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్ఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన చేబ్రోలు నాగేశ్వరావు తనకున్న ఎనిమిది సవర్ల బంగారపు వస్తువులు, రూ.10 వేలను ఇంట్లోని స్టీల్ బాక్స్‌లో పెట్టి ఆ బాక్స్‌ను అలమరలో పెట్టి దానికి మంచం అడ్డుపెట్టారు. 8 వ తేదీన ఉదయం పరిశీలించగా అన్నీ సరిగానే ఉన్నాయి. 9వ తేదీన ఉదయం ఉదయం 5 గంటలకు చూసుకోగా బాక్స్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెదికారు. కనిపించకపోవడంతో ఎవరో చోరీ చేసి ఉంటారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సొత్తు విలువ రూ.2.10 లక్షలుంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.



మాట్లాడుతున్న పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కెవివి సత్యనారాయణ

నడింపాలెంలో పశువుల అందాల పోటీలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని నడింపాలెంలో గురువారం మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. పశు వర్ధక శాఖ డాక్టర్ సుగన్యారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ కె.వీ.వీ.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు దూడలలో సరైన ఎదుగుదలకు కావలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ నిర్ధారిత వీర్యం వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం మేలు జాతి ఆవు, గేదె దూడలలో పోషణ కలిగిన వాటికి బహుమతులు అందజేశారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.శంకరరావు, చల్లావారిపాలెం డాక్టర్ వై.ఈశ్వరరెడ్డి, వంగిపురం డాక్టర్ సిహెచ్.హరీష్ ఖన్నా, గొట్టిపాడు పశువైద్యులు డాక్టర్ కే.వీ. యస్.నంద కిశోర్ రైతులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తల్లి గర్భం దాల్చిన తర్వాత అనేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్తిపాడు సెక్టార్ సూపర్ వైజర్ ఎస్.భారతి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని నడింపాలెం సాయి ప్రభు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. గర్భందాల్చిన దగ్గర్నుంచి ఎంతో జాగ్రత్తగా ఉండాలని, బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తయారీపై వివరించారు. తల్లులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వనరుల పెరుగుదలతో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామ పంచాయతీల వనరులు పెరిగితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి (డిఎల్‌పిఒ) వి.వి.ఎం లక్ష్మణరావు అన్నారు. రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. తడి, పొడి చెత్తను ఇళ్ల నుంచి వేర్వేరుగా సేకరించి, వాటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువులు తయారు చేసి దాన్ని విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయం పెరుగుతుందన్నారు. ఇంటి పన్నులు వసూళ్లు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. ఫ్రైడే-డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



బాణసంచా దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయ దుకాణాలను రూరల్ సిఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐ జి.అనిల్ కుమార్ గురువారం పరిశీలించారు. లైసెన్సులను తనిఖీ చేశారు. షాపుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలును ప్రకారం పనివేళలు పాటించాలని చెప్పారు. నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటామన్నారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

మనకున్న దాంట్లో కొంత సమాజం కోసం ఖర్చు చేస్తే ఆ తృప్తిని, ఆనందాన్ని వర్ణించడానికి భాష చాలదని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సభ్యులు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు గాండ్ల నాగేంద్రుడు మాస్టారు అన్నారు. ఆయన సహకారంతో క్లబ్ ఆధ్వర్యంలో శావల్యాపురం మండలం పొట్లూరు జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను, ఈపూరు మండలం కొచ్చర్ల ప్రాథమిక పాఠశాలకు బీరువాను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా నాగేంద్రుడు మాస్టారును హెచ్‌ఎంలు అన్నపూర్ణ, ఎ.పూర్ణచంద్రరావు సత్కరించారు. క్లబ్ సభ్యులు ఎ.శ్రీనివాసరావు, సిహెచ్.కోటేశ్వరరావు, ఎం.గిరిబాబు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించాలని గుంటూరు రైల్వే డిఆర్‌ఎం సుధీష్ణ సేన్ అన్నారు. ప్రమాదాల సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షిత చర్యలపై స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విధుల్లో ఉన్నవారు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ శ్రీధర్, తహశీల్దార్ ధనలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నవులూరు గ్రామంలో ఈనెల 7వ తేదీ రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయస్థానం గురువారం తీర్పు చెప్పింది. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పున్న శంకరరావు (55) అనే వ్యకి ఈనెల 7వ తేదీ రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో కర్రీస్ కోసం బయటకు వచ్చి రోడ్డు మార్జిన్ వద్ద నిలబడి ఉన్నాడు. అదే సమయంలో మంగళగిరి పట్టణం వైపు నుంచి గమల్లపల్లి రాంబాబు అనే ఆటో డ్రైవర్ తన టాటా మ్యాజిక్ వాహనాన్ని



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ వెంకట్

మద్యం సేవించి నిర్లక్ష్యంగా నడుపుతూ శంకరరావును ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో శంకరరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పక్కనే ఉన్న మరో వ్యక్తి రాఘవ సాయికుమార్‌కు గాయాలయ్యాయి. మరో వ్యక్తిని గుండు శ్రీరామమూర్తిని ఢీకొట్టినట్లు తెలిపారు. మొదటి దర్యాప్తులో నిందితుడు మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలడంతో అతనిపై తీవ్ర నేరాల కింద కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకట్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు కోల్పోతున్నందున, ఇటువంటి నిర్లక్ష్య ప్రవర్తనకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్ హెచ్చరించారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు

అంతర్జాతీయ బాలికా దినోత్సవంను పురస్కరించుకుని గురువారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని అబ్బురాజుపాలెం, మందడంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైమరీ స్కూల్ హెచ్ ఎం.శ్రీనివాస రావు మాట్లాడుతూ బాల బాలికల రక్షణ, అభివృద్ధి కోసం గుడ్ షెపర్డ్ సంస్థ నిరంతరం పనిచేస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో మందడం సచివాలయ మహిళా పోలీస్ జయవర్ధిని, గుడ్ షెఫర్డ్ సిబ్బంది పి.అనిల్ కుమార్,మహిళా పోలీస్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



అధికారులకు వాహనాలు అందజేస్తున్న సిఆర్‌డిఎ కమిషనర్

నర్సరీకి వాహనాల అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో 20 ఎకరాలలో విస్తరించి ఉన్న సిఆర్‌డిఎ సెంట్రల్ నర్సరీ, అవెన్యూ మొక్కల పెంపకం నిర్వహణ కోసం నూతన వాహనాలు అందజేసింది. నర్సరీ నిర్వహణ నిమిత్తం 47 హెచ్‌పి ట్రాక్టర్ లు,వాటర్ ట్యాంకర్, ట్రైలర్‌ను తాజాగా సి ఆర్ డి ఎ కొనుగోలు చేసింది.సి ఆర్ డి ఎ కమిషనర్ కె.కన్నబాబు సంబంధిత అధికారులకు వాహనాలను గురువారం అందజేశారు. రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు సిఆర్‌డిఎ కట్టుబడి ఉందని, అందుకు అనుగుణంగా వాహనాలు సమకూర్చి నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సి ఆర్ డి ఎ ల్యాండ్ స్కేప్, ఎన్విరాన్‌మెంట్(ఎల్ ఎస్ ఈ) విభాగ అడిషనల్ డైరెక్టర్ ఎం హరిప్రసాద్- హార్టికల్చర్ (ఎఫ్ ఎ సి), డిప్యూటీ డైరెక్టర్ బి.జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఎ.శివ రామ కృష్ణ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట

ప్రజాశక్తి - తెనాలి

జీఎస్టీ అమలులో ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు పేద మధ్యతరగతి వర్గాలకు లాభదాయకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన జీఎస్టీ 2.0 అవగా.న సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో కనీసం రూ.15వేల రూపాయలు ప్రయోజనం కలుగుతుందన్నారు. గుంటూరు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి మాట్లాడుతూ జిఎస్టి తగ్గుదల సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని, వ్యాపార లావాదేవీలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గుంటూరు డివిజన్-1 వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ ఏ వస్తువులపై పన్నులు తగ్గాయన్నది వివరించారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్-2 వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ జి మురళి కఅష్ణ, తెనాలి అసిస్టెంట్ కమిషనర్ వి ముత్యాలరావు, నన్నపనేని సుధాకర్, పెండేల వెంకటరావు, అనంతాచార్యులు, వర్తక వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.హరికిషోర్, వాణిజ్య పనుల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం బోర్డు మెంబర్ రమణకు సన్మానం



రమణను సన్మానిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

శ్రీశైలం దేవస్థానం మెంబర్ ఎన్నికైన రమణను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం సన్మానించారు. ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామానికి చెందిన టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, టిడిపి నాయకులు రాష్ట్ర టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు రమణకు టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గుండిమెడ గ్రామ పార్టీ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, చిర్రావూరు గ్రామ పార్టీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లిబోయిన శ్రీనివాసరావు, మక్కపాటి ఏసు ప్రసాద్, చిర్రవూరు గ్రామ ఉపాధ్యక్షులు మక్కపాటి వెంకట కృష్ణారావు, దావులూరి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరచాలి : ఎంఈఓ ఆర్.సుబ్బారావు

ప్రజాశక్తి - చేబ్రోలు

అభ్యాసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు మెరుగుపరచుకోవాలని ఎంఈఓ ఆర్. సుబ్బారావు సూచించారు. గురువారం వడ్లమూడి గౌడ పాలెంలోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల (ఎ)ను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, సంతృప్తికరంగా వుందని అన్నారు. అనంతరం పాఠశాల రిజిస్టర్లను , విద్యార్థులు , ఉపాధ్యాయుల హాజరు వివరాలు తనిఖీ చేశారు. విద్యార్థుల అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు పరిశీలించిన ఆయన వారి సంపూర్ణ పురోగతి కార్డులు సంబంధించి విలువైన సూచనలు ఇచ్చారు.



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్బారావు

వర్షాలకు ఉరకెత్తిన పత్తి పంట

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలో కురిసిన వర్షాలకు పత్తి పంట ఉరకెత్తింది. దీంతో సొంత భూమి కలిగిన రైతులకు కౌలు చెల్లించి భూమిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి శ్రమించి రైతులకు నిరాశే మిగిలింది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి భూమిపై పెట్టుబడి పెట్టిన కౌలు రైతులపై ప్రకృతి చిన్నచూపు చూస్తే ఆ రైతులకు దిక్కెవరు. ఒకవైపు ప్రభుత్వ లోపం వల్ల యూరియా కొరతతో మరోవైపు తుఫానుల బెడదతో రైతులు కౌలు రైతులు బంబేలు ఎత్తిపోతున్నారు. ఫిరంగిపురం మండలంలో 17 గ్రామ పంచాయతీలతోపాటు శివారు గ్రామాలు మొత్తం కలిపి 20 గ్రామాలలో 54 0 4 హెక్టార్లు అనగా 13 512 ఎకరాలలో పత్తి పంటను ఈ సంవత్సరం రైతులు సాగు చేయగా అకాల వర్షాలకు పంట దెబ్బతిని పత్తి చెట్టు ఎదగక గూడపిందే రాలిపోయిందని





ఉరకెత్తిన పంట నాశనమైన దృశ్యం, పంట పొలాన్ని చూపుతున్న రైతులు

పచ్చ దోమ తెల్ల దోమ లద్దె పురుగు పంటను ఆశించి నష్టం చేకూర్చాయని ఇప్పటికీ మొదటి విడత పత్తి తీయాల్సిన పరిస్థితి కోల్పోయామని రైతులు వాపోతున్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

రోడ్డు భద్రతను పెంపొందించే లక్ష్యంతో గురువారం సాయంత్రం ఫిరంగిపురం పోలీసులు గ్రామం శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలలో వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వారికి, అలాగే వాహనం నడుపుతున్నప్పుడు హెల్మెట్ ధరించని వారికి పోలీసులు చలానాలు విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులపై కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, వాహన పత్రాలు వెంట ఉంచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, ఏఎస్ఐ జాన్ జాన్ తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఎస్ఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా సూచించారు.

వీధి కుక్కల దాడి.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి - కొల్లిపర

మండల పరిధిలోని తూములూరు కొల్లిపర గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది తుములురు గ్రామ శివారు యాదవపాలెం చెందిన బాలిక ఆనంద శ్రీ, కొల్లిపర గ్రామానికి చెందిన మోహనరెడ్డి గంగోత్రి, శివయ్య తదితరులపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరు కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కలు ఎక్కువయ్యాయని మండల తహశీల్దార్, ఎంపీడీవో అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి కుక్కల దాడిలో గాయపడిన గ్రామస్తులు స్థానిక ఆర్ఎంపీలు వద్ద వైద్యం చేయించుకోవద్దని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి కావున కుక్క కాటు గురైన వారు తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించుకోవాలని డాక్టర్ శ్రావణి తెలిపారు.

మహిళా ఉద్యోగినికి వేధింపులు

ప్రజాశక్తి - యడ్లపాడు

పల్నాడు జిల్లా, యడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తేదీ: 09.10.2025న కారుచోల గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిపై, అదే గ్రామానికి చెందిన జాజుల తిరుపతయ్య అనే వ్యక్తి అశ్లీలంగా ప్రవర్తించి, లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. సదరు మహిళ ఉద్యోగి విధి నిర్వహ లో ఉండగా ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె అతని నుండి తప్పించుకొని యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

లోపాలను సవరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

గౌడ కులస్తులు కుల ధ్రువీకరణ పత్రాలు పొందటంలో వస్తున్న లోపాలను తక్షణమే సవరించాలని గురువారం బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సత్యనారాయణ, స్టాంప్స్ అండ్ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలసి కుల ధ్రువీకరణ పత్రాల్లో ఇంగ్లీష్ అక్షరాల పొందికలో చేస్తున్న పొరపాట్ల వల్ల కుల విభజనకు అవకాశం ఉందన్నారు. ఒకటే పదం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రభుత్వ పథకాల్లో, విద్య అవకాశల్లో ఆవిధంగా వచ్చేట్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఎస్.సత్యనారాయణ ప్రభుత్వ కార్యదర్శి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మురళి, కుక్కలరాంప్రసాద్,మార్ల వెంకటకఅష్ణ,ఎడవల్లి ఏడుకొండలు గౌడ్ మరియు గౌడ సంఘ నాయకులు తదితరులు వినతి పత్రం సమర్పించారు.



కబ్జాలకు పాల్పడుతున్న టిడిపి నాయకులు

విచారణ చేయకుంటే కోర్టును ఆశ్రయిస్తాం : వైసిపి

ప్రజాశక్తి బెల్లంకొండ

జెడ్‌పి స్థలం లీజు విషయంలో అక్రమాలు జరిగాయని జెడ్‌పిటిసి గాదె వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. బెల్లంకొండ మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 363లో జిల్లా పరిషత్ స్థలం 9 సెంట్లకు వేలం నిర్వహించకుండా టిడిపి నాయకుడైన పిఎస్కే మస్తాన్ షరీఫ్‌కు నిబంధనలకు విరుద్ధంగా లీజుకిచ్చారని వైసిపి నాయకులు ఆరోపించారు. జెడ్‌పి రూ.లక్షల్లో ఆదాయం రావాల్సి ఉన్నా రూ.16,500కు మాత్రమే ఏడాది లీజుకు ఇస్తూ అనుమతి కోసం జెడ్‌పికి పంపించారని చెప్పారు. దీనిపై జెడ్‌పి చైర్‌పర్సన్, సిఇఒలు వెంటనే విచారణ జరిపించాలని, లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. బెల్లంకొండలోని సర్వేనెంబర్ 524లో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఎకరం భూమిని టిడిపి మాజీ సర్పంచ్, అతని అనుచరులు ఆన్‌లైన్ చేయించుకున్నారని, రెండెకరాల్లో పక్కా నర్మాణాలు చేపట్టారని, వీటిపైనా విచారణ చేయాలని కోరారు. 45 సెంట్ల శ్మశానాన్ని కబ్జా చేసి రేకుల షెడ్ల నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్న పిఎస్కే మస్తాన్ షరీఫ్‌పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు చింతలపాటి నాగూర్ మీరా, సయ్యద్ అల్లబక్షు, దాదు సాహెబ్, మాడుగుల షేక్ మహబూబ్ బాషా, ఖాజావలి పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈనెల 7న సత్తెనపల్లి మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ ఎంపికల్లో, 8న తాడికొండ బి.ఎస్.ఎస్.బి జూనియర్ కళాశాలలో జరిగిన కబడ్డీ ఎంపికల్లో తమ విద్యార్థులు 10 మంది పాల్గొన్నారని చెప్పారు. వీరిలో రాష్ట్రస్థాయి బాలల కబడ్డీ పోటీలకు డి.త్రినాథ్, ఎన్.రమణయ్య, బాలికల విభాగంలో కె.లక్ష్మీ సరిత, కె.అనూహ్య, బ్యాడ్మింటన్‌కు షేక్.మహమ్మద్ ఎంపికైనట్లు వివరించారు. వచ్చే నెల వినుకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పల్నాడు జిల్లా తరుపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల డైరక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పివి అచ్యుతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు అభినందించారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట : పట్టణ ప్రణాళిక, అనధికార నిర్మాణాలపై సిబ్బందితో కమిషనర్ పి.శ్రీహరిబాబు గురువారం సమీక్షించారు. ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)ను వేగవంతం చేయాలని, అనధికార, అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. క్రమబద్ధీకరణలో భాగంగా, రోడ్ల మార్కింగ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని హెచ్చరించారు.

ఇళ్లు కట్టుకున్నా ఉండలేని దుస్థితి



పేదల సమస్యలను నమోదు చేసుకుంటున్న రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు

- కనీస సదుపాయాలకు రూపాయి అయినా ఖర్చుపెట్టని కూటమి
- రెండుసెంట్ల స్థలం హామీ విస్మరణ
- పేదల ప్రాంతాల్లో సిపిఎం పరిశీలన
- నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నామని పలువురి ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇళ్లస్థలం లేని పేదలకు రెండు సెంట్లు ఇస్తామనే ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేదని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని పలు పేదల నివాసాలను సిపిఎం నాయకులు గురువారం సందర్శించారు. స్థానిక పసుమర్రు వద్ద గత ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాల్లో గుడారాలేసుకుని నివాసం ఉంటూ, గంగిరెద్దులను ఆడించడం ద్వారా జీవనం సాగిస్తున్న ఏడు కుటుంబాలతో నాయకులు మాట్లాడారు. తమకు స్థలాలిస్తామని చెప్పి అధికార పార్టీ నాయకులు జగనన్న కాలనీ పక్క స్థలాల్లో ఉండాలన్నారని నివాసితులు చెప్పారు. దోమల వల్ల నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నామని, ఎప్పుడు ఈ పురుగు, పుట్ర వస్తుందో భయంగా గడుపుతున్నామని వారు ఆవేదనతో చెప్పారు. తమలో చాలామంది రోగాలబారిన పడ్డారని, వృద్ధులు, వితంతువులకు పింఛను కూడా రావడం లేదని తెలిపారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ ఉన్న స్థలాన్ని రెండు సెంట్లుగా విడగొట్టి వీరికి పట్టాలివ్వడంతోపాటు ఇళ్లనూ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరికి వసతులు కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. దీనిపై స్థానిక తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు విన్నవిస్తామని చెప్పారు. జగనన్న కాలనీలో సగానికి పైగా ఇళ్ళ నిర్మాణం పూర్తయినా నివాసం ఉండలేని దుస్థితి నెలకొందని, కాంట్రాక్టర్‌కు ఇచ్చి కట్టించిన ఇళ్లపై శ్లాబు నుండి నీరు కారుతున్నట్లు స్థానికులు చెబుతున్నారని అన్నారు. తాగునీటి సదుపాయమూ లేదన్నారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



జగనన్న కాలనీలో ఇళ్ల మధ్య ముళ్ల చెట్లు

రూ.కోట్లతో భూములు కొన్న గత ప్రభుత్వం లబ్ధిదారుల్లో ఒక్కొక్కరికి రూ.1.8 లక్షలే ఇంటి నిర్మాణం కోసం ఇవ్వడంతో అవి చాలక లబ్ధిదార్లు మరో రూ.2-4 లక్షలు ఖర్చుతో ఇంటి నిర్మాణం చేసుకున్నారని, ఇళ్లు నిర్మించుకోకుంటే స్థలాలు వెనక్కు తీసుకుంటామని అప్పట్లో ప్రభుత్వం చెప్పడంతో చాలామంది అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారని తెలిపారు. అయినా ఈ ప్రాంతంలో మౌలిక వసతులు లేని కారణంగా ఇక్కడ నివాసం ఉండలేకపోతున్నారని తెలిపారు. ఇక్కడున్న ఖాళీస్థలాలతోపాటు రహదారుల్లోనూ ముళ్లచెట్లు పెరిగాయని, విద్యుత్ స్తంభాలున్నా లైట్లు లేకపోవడంతో రాత్రిళ్లు రాకపోకలు, సంచారం కష్టమైందని తెలిపారు. పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ప్రాంతాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మౌలిక సదుపాయాలు సత్వరం కల్పించాలని, ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయించి ప్రజల నివాసానికి వీలు కల్పించాలని కోరారు. కొత్తగా నిర్మించే ఇళ్లకు రూ.6 లక్షలు కేటాయించాలన్నారు. పరిశీలనలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో సిఐటియు పల్నాడు జిల్లా మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


సిఐటియు పల్నాడు జిల్లా 3వ మహాసభను పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాశక్తి నగర్‌లోని కన్నెగంటి హనుమంతు భవన్‌లో డి.శాంతమణి అధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు జి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల ప్రమాదాన్ని వివరించారు. స్కీమ్ వర్కర్లకు గ్రాడ్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా ఇవ్వడం లేదని, గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం సిద్ధమండం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, జిల్లా మహాసభలో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పారిశ్రామిక కేంద్రమైన పిడుగురాళ్ల పట్టణంలో నిర్వహించే మహాసభకు ఎంతో ప్రాధాన్యముందన్నారు. సున్నంబట్టీలు, క్వారీలు, మిల్లుల్లో కార్మికులకు పని భద్రత లేక ప్రమాదపు అంచుల్లో పని చేస్తున్నారని, ఏదైనా జరిగితే పట్టించుకునేవారే లేరని, కనీస సదుపాయాలకూ కార్మికులు నోచలేదని అన్నారు. స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఆపి కనీస వేతనం రూ.26 వేలు అమలు, మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేయాలని కోరారు. వీటి సాధన కోసం ఉద్యమించేందుకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి సిఐటియు జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, అన్ని రంగాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తెలగపల్లి శ్రీనివాసరావు, సభ్యులుగా డి.శాంతమని, టి.అక్కమ్మ, రమణ, కంప సాగర్‌బాబు, మణికంఠ, శేషుదాసు, మద్దిరాల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

బోధనేతర పనులను బహిష్కరిస్తున్నాం : ఫ్యాప్టో



ప్రజాశక్తి-చిలకలూరిపేట : ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించాలనే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫ్యాప్టో నాయకులు గురువారం ఎంఇఒ వివిఎస్ చంద్రకళకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో పట్టణ అధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యా యులను బోధనకే పరిమితం చేయాలని, అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. మూల్యాంకన పుస్తకాలు రద్దు చేయాలని, గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్టీ, ఇతర సీజనల్ ప్రచారాలను ఉపాధ్యాయులపై రుద్దడం అన్యాయమ న్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకోవాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై ప్రభుత్వ పాఠశాల విద్య బలోపేతానికి, విద్యారంగం పరిరక్షనకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వి.జయప్రకాష్, షేక్ మస్తాన్‌వలి, వి.రమణ నాయక్, అనిల్, పి.శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం : ఉపాధ్యాయులకు బోధనేతర పనులను మినహాయించాలని కోరుతూ ఎంఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు కె.రవికుమార్ మాట్లాడుతూ బోధనేతర పనులు, యాప్‌లను బహిష్కరి స్తున్నట్లు చెప్పారు. నాయకులు బి.ఫణికుమార్, కె.పురు షోత్తం, హేమకిరణ్, బాలాజీ నాయక్, సంపత్, శ్రీనివా సరావు, తులసి, సురేఖ, కుదిషియ, శ్రీదేవి పాల్గొన్నారు.





స్కూల్ ఫెడరేషన్ క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో హెచ్ఎం మూర్తి గురువారం ప్రారంభించారు. విద్యార్థినులతో కబడ్డీ ఆడి ఉత్సాహ పరిచారు. వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్ జంప్ తదితర క్రీడల్లో అండర్-17 విభాగంలో పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని విరి ప్రవళిక ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం తెలిపారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి వి.కేశవ వాలీబాల్, రన్నింగ్ లో ప్రతిభ కనబరిచారని, సీనియర్ విభాగం ఖోఖోలో సతీష్, సిహెచ్ రాజేష్, పి.ఆనంద్‌బాబు, కె.ఎతిక్, చెస్‌లో జి.చాణిక్య, కె.చైతన్య, రన్నింగ్‌లో రాంబాబు, రాజు ఎంపికైనట్లు వివరించారు.



క్రీడల్లో బిసి గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్‌పి జెడ్‌పి పాఠశాలలో జరుగుతున్న ఆటల పోటీల్లో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. వాలీబాల్, కబడ్డీ, యోగ, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో మండల స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఎంపికైన వారిని హెచ్ఎంతోపాటు ఎటిపి యోగయ్య, పిఇటి జోనా నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

నల్లబర్లీ సాగు నిషేధం

ప్రజాశక్తి - నాదెండ్ల : నల్లబర్లీ సాగును నిషేధించిన నేపథ్యంలో ఎవ్వరూ సాగు చేయొద్దని ఏవో శ్రీలత కోరారు. నాదెండ్లలో రైతులకు గురువారం అవగాహన కల్పించి కంది, మినుము, పెసర, శనగ పంటలను సాగు చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ షేక్ సాల్మన్ మాట్లాడుతూ పొగాకు నర్సరీలను ఎవరైనా వేస్తేమండల ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. నాదెండ్ల సొసైటీ చైర్మన్ ఎన్.హరిబాబు, పాల్గొన్నారు.

ఎంటిఎంసి పరిధిలో అర్హులందరికీ ఇళ్లస్థలాలివ్వాలి : సిపిఎం

13 నుండి మంగళగిరిలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు


మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో గురువారం రాత్రి, సిపిఎం నాయకులతో కలిసి, ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ సంవత్సరం ఆరు నెలలు పూర్తవుతున్న ఇచ్చిన వాగ్దానం నెరవేర్చలేదన్నారు. ఒక్క సెంటు స్థలం కూడా ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గం లో 20 వేల మందికి పైగా ఇంటి స్థలాల లబ్ధిదారులు ఉన్నారని ఆనాడే చెప్పారని, ఏ ఒక్క లబ్ధిదారుడి కోసం భూమి సేకరణ చేయలేదని అన్నారు. అరులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల మూడవ తేదీ నుండి గ్రామ గ్రామాన ప్రదర్శనలు, ప్రచారం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఈనెల 13, 14, 15 తేదీలలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ఇల్లు నిర్మించి ఇవ్వాలని నిరాహార దీక్షలు చేస్తున్నట్లు నేతాజీ తెలిపారు. అక్టోబర్ 17వ తేదీ మంగళగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారుల తో వ్యక్తిగత అర్జీలు మున్సిపల్ కమిషనర్ కి అందజేస్తునమని ఆయన అన్నారు. ప్రభుత్వ అధికారుల వెంటనే వెరిఫికేషన్ చేసి, లబ్ధిదారుల జాబితా ప్రకటించాలన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో లోకేష్ చేసిన హామీలను నెరవేర్చాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తాడేపల్లి మండలంలో ఇప్పటికీ ఇల్లు లేని పేదలు అద్దెలు కట్టుకోలేక పెరిగిన ధరలతో అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు మాట్లాడుతూ కుంచనపల్లి గ్రామంలో గత 45 సంవత్సరాలుగా ఇల్లు లేని నిరుపేదలకు ఒక్క సెంటు భూమి కూడా పాలక ప్రభుత్వాలు ఇవ్వలేదని అన్నారు. వెంటనే అర్హులైన పేదలను అధికారులు గుర్తించి, ఇంటి స్థలం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : మంత్రి నారా లోకేష్ హామీ మేరకు పేదల్లో పేదలమైన మాకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాల్సిందేనని తాడేపల్లి పట్టణం సీతానగరంలో నీ బోటు యార్డ్ దగ్గర నివాసం ఉంటున్న పేదలు స్పష్టం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం రెండు సెంట్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తులు పూర్తిచేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ ఎంటిఎంసి కార్యాలయం (మంగళగిరి) ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మంత్రి నారా లోకేష్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలందరికీ తమ అధికారంలోకి వస్తే రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తానని చేసిన వాగ్దానాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు. బోటు యార్డు దగ్గర గత 11 సంవత్సరాలుగా తాత్కాలిక స్థలాలు (35 గజా లు) లో అనేక ఇబ్బందులు పడుతూ నివాసం ఉంటున్న పేదలకు ఈ ప్రభుత్వం అయినా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేఎల్ రావు కాలనీ కార్యదర్శి కట్ట మేరీ స్థానికులు పాల్గొన్నారు.



14న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



మాట్లాడుతున్న పాశం రామరావు

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 14న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య కాలనీలో ప్రచారం ప్రారంభించి పాశం రామారావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అర్హులైన పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని వాగ్దానం చేశారని, ప్రభుత్వ భూముల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేశారని వారి వాగ్దానం అమలు చేయాలని కోరారు. పెదకాకాని సుందరయ్య కాలనీ, వడ్డెర కాలనీ, ఎస్టీ కాలనీ, జాన్ హోస్పర్ స్వర్ణ పూరి కాలనీ ఎన్టీఆర్ కాలనీ తదితర కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని, గుంటూరు ఛానల్ ఇతర కాలువలకు గండ్లు పడినాయని వాటిని వెంటనే మరమ్మతులు చేయించి, కట్టలను పటిష్ట పరచాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల జనాలు జబ్బులు బారిన పడే అవకాశం ఉందని వెంటనే వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. నంబూరు గ్రామం చుట్టూ కాలువలు పొంగి పంట పొలాలు ముంపునకు గురి గురయ్యాయని తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని కోరారు. కార్యక్రమంలో జిరాజా రమేష్,బి.సాంబయ్య,ఎస్.నీలాంబరం, కె.సత్యనారాయణ, కె.రాఘవయ్య, ఏ.నాగేశ్వరావు, సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని 13, 14 తేదీల్లో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని చిలువూరులో కౌలు రైతు సంఘం గ్రామ మహాసభ నాయకులు బండ్లమూడి కనకాంబరం అధ్యక్షతన నిర్వహించారు. అనంతరము 13 మందితో గ్రామ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మేళం అంజయ్య, కార్యదర్శిగా పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, ఉపాధ్యాక్షులుగా పీ కాటమరాజు, సహాయ కార్యదర్శిగా ఎన్ రాంబాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాల రాజు తది తరులు పాల్గొ న్నారు.



రెండోరోజుకు పారిశుధ్య కార్మికుల నిరసనలు


రాయపూడిలో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు.

ప్రజాశక్తి - తుళ్లూరు

తక్షణమే రెండు నెలల పెండింగ్ జీతాలను చెల్లించా లంటూ రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసనలు కొనసాగు తున్నాయి. రెండోరోజు గురు వారం కార్మికులు తుళ్లూరు, రాయపూడి, నెక్కల్లులో పనివిరామ సమయంలో నిరసన తెలిపారు.రాజధాని నిర్మాణం నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది కార్మికులు రావడంతో గ్రామాల్లో చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపో తున్నాయని, దీంతో పని భారం పెరిగిందని కార్మికులు వాపోతున్నారు. ప్రభుత్వానికి, అధికారులకు విషయం తెలిసినా కార్మికుల సంఖ్యను పెంచకపోగా, పనిభారంతో సతమతమవుతున్న కార్మికులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో పని విరామ సమయంలో నిరసన తెలుపుతున్నామన్నారు. రాయపూడిలో కార్మికుల నిరసనలో పాల్గొన్న రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ శుక్రవారం తుళ్లూరు సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కై సామూహిక రాయబారం నిర్వహించి, అధికారులకు అర్జీ అందజేయడం జరుగుతుం దన్నారు. రెండు, మూడు నెలల జీతాలు చెల్లించకుండా పెండింగ్ పెట్టడం, ఆందోళన చేస్తే ఒక నెల జీతం విదల్చ డం అధికారులకు పరిపాటిగా మారిందని రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితులు, పేదలైన పారిశుధ్య కార్మికులు బలహీనులు కాదని, వారికి రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం,సిఐటియు అండగా ఉన్నాయని చెప్పారు. జీతాలు చెల్లించకపోగా సమావేశాల పేరుతో కార్మికులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారని, జీతాల చెల్లింపులో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. జీతాలు రాక, గాడిద చాకిరి చేయలేక 300 మంది పారిశుధ్య కార్మికుల్లో 150 మంది మానేశారని, ఉన్న 150 మందితో రాజధానిలో పారిశుధ్యం మెరుగుపరచటం ఏ విధంగా సాధ్యమవుతుందని రవి ప్రశ్నించారు. కార్మికుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిసు ్తండటం ఏమాత్రం న్యాయం కాదని అన్నారు. పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని రాజధాని ప్రజలు ప్రశ్నించాలని, మద్దతు ఇవ్వాలని రవి విజ్ఞప్తి చేశారు.





అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలో గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండల కమిటీ సమావేశం ఇందువాణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, చాలీచాలని జీతాలు తీసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్నారని అలాంటి అంగన్వాడీ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు వారికి శాపంగా మారాయని అన్నారు. అంగన్వాడీలకు నాలుగు నెలలుగా బిల్స్ ఏవి రావడం లేదన్నారు. అంగన్వాడీ కార్యకర్త లకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ నుండి నిధులను విడుదల చేయాలని, అంగన్వాడీలకు తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ ,ఇతర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. హెల్పర్లను వర్కర్లుగా ప్రమోట్ చేసి ఖాళీ స్థానాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం శివాజీ, టి.వర కుమారి, ఎం.డి రుక్సానాబేగం, పి.కనకవల్లి, పి.అంజనాదేవి, కె.రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేతగా పెనుమాక జెడ్‌పి పాఠశాల

రన్నరప్‌గా నిలిచిన తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్

ప్రజాశక్తి- తాడేపల్లి

గురువారం వందేమాతరం జిల్లా పరిషత్ హై స్కూల్ పెనుమాకలో జరిగిన కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో పెనుమాక జిల్లా పరిషత్ హై స్కూల్ విన్నర్స్‌గా నిలిచింది. రన్నర్స్ తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నిలిచింది. అలాగే అండర్ 17బాలికల విభాగంలో అరవింద హైస్కూల్ కుంచనపల్లి, విన్నర్ గాను, పెనుమాక జిల్లా పరిషత్ హై స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. అండర్ 14 బాలుర విభాగంలో పెనుమాక హై స్కూల్ విన్నర్ గాను, జిల్లా పరిషత్ హైస్కూల్ తాడేపల్లి రన్నర్ గాను అలగే అండర్ 14 బాలికల విభాగంలో పెనుమాక హై స్కూల్ విన్నర్ గాను గుడ్ న్యూస్ హై స్కూల్ తాడేపల్లి రన్నర్ గాను కొనసాగాయి. వాలీబాల్ గేమ్‌లో అండర్ 17 బాలుర విభాగంలో పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విన్నర్‌గాను రామకృష్ణ హై స్కూల్, సీతానగరం రన్నర్ గానుచ అండర్ 14 బాలుర భాగంలో విన్నర్ వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ రన్నర్ గుడ్ న్యూస్ హై స్కూల్ తాడేపల్లి అండర్ 14 బాలికల విభాగంలో విన్నర్ వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ రన్నర్ తాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ తమ స్థానాలు సొంతం చేసుకున్నాయి. పోటీలను పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ హై స్కూల్ పెనుమాక ప్రధానోపాధ్యాయులు అనంత శివ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని విద్యార్థినీ విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ గెలుపొందినట్లుగా భావించాలని, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పి ఈ టి మాస్టర్ రమేష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

దళితులను రెచ్చగొట్టేందుకే అంబేద్కర్ విగ్రహానికి నిప్పు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిత్తూరు జిల్లాలో డాక్టర్ బి.ఆర్. అం బేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన ఘటనపై నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్య క్షులు కొండా వీరయ్య గురువారం తీవ్రంగా ఖండించారు. ఈ చర్య వెనుక దళితులను రెచ్చ గొట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనే దురుద్దేశం ఉందన్నారు. అంతే కాకుండా “అంబే డ్కర్ విగ్రహం అంటే దేశ గౌరవం – దానిపై దాడి చేయడం ప్రజాస్వా మ్యం పై దాడి చేసినట్టే” అని తీవ్రం గా స్పందించారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడి చేసిన వారిని ప్రమోషన్ ఇచ్చి, పక్కన కూర్చోబెట్టు కుని సెల్ఫీలు దిగిన జగన్ కూడా ఈ రోజు దళితుల గురించి మాట్లాడు తుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఇనగంటి జగదీష్, చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, దళిత ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

19న కళాసాగరి వార్షికోత్సవం

ప్రజాశక్తి – వినుకొండ

ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాసాగరి 5వ వార్షికోత్సవం ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారి సౌజన్యంతో నరసరావుపేట రోడ్డులోని జాషువా కళా ప్రాంగణంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సినీ గీతాల పోటీలు, సంగీత సభలో కళాసాగరి బాలు స్మారక పురస్కారం, పాల్ హ్యారిస్ రోటరీ సేవా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి – మాచర్ల రూరల్

చెన్నకేశవ కాలనీలో హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో గురువారం దైవ సేవకుల నూతన కమిటీని ఎంపిక చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ వెస్లీమాట్లాడారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ రాజారావు హాజరయ్యారు. వ్యవస్థాపక ఉపాధ్యక్షులు ఎలీషా దైవ సేవకులకు సందేశం అందించారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా మోహన్ బాబు, ఉపాధ్యక్షుడుగా సుందరరావు, కార్యదర్శిగా జాషువా, ట్రెజరర్ లాజరు, సహాయ కార్యదర్శి డేవిడ్ రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా సిలువ రాణి, పీటర్ పాల్ ను ఎన్నుకోబడినట్లుగా కోర్ కమిటీ ప్రకటించింది. నూతన కమిటీకి సభ్యులందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్కామ్ వెనుక జగన్

ప్రజాశక్తి – మాచర్ల



మాట్లాడుతున్న కొమెర దుర్గారావు

లక్ష కోట్ల రూపాయల మద్యం స్కామ్ వెనుక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘ కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు అన్నారు. అక్రమ మద్యంపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు జగన్ లేదని, అతని హయాం నుండే ఈ దందా నడుస్తుందని పేర్కొన్నారు. అక్రమ మద్యం, తక్కువ రకం మద్యం తాగి ఎందరో ప్రాణాలు విడిచారని, వారి మరణాలకు కారణం జగనేనన్నారు. ప్రజలకు అన్నీ తెలుసని, అన్నీ గమనిస్తారని నీవు చెప్పే అబద్దాలు నమ్మే పరిస్థితిలో లేరని దుర్గారావు విమర్శించారు.

లగడపాడులో కంపోస్టు తయారీ

ప్రజాశక్తి – పెదకూరపాడు



వానపాములను వదులుతున్న అధికారులు

లగడపాడు గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వ్యర్థ పదార్థాలను కంపోస్ట్‌గా మార్చే క్రమంలో వానపాములను గురువారం వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సాయి లీల మాట్లాడుతూ పొడి, తడి చెత్త సేకరణ కార్యక్రమం ప్రతి ఇంటి నుండి సేకరించి క్లాప్ మిత్రాలు ఇక్కడికి చేర్చాలన్నారు. ఆ క్రమంలో ఇంటి మహిళ ప్రధాన పాత్ర వహించి వారికి ఆ విధంగా చేరవేసినట్లయితే స్వచ్ఛ గృహం స్వచ్ఛ లగడపాడుగా తయారవుతుందన్నారు. ఏదైనా మహిళల ద్వారానే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పాల్గొని మన గ్రామాన్ని మనమే శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో మొట్టమొదటిగా మా గ్రామాన్ని ఎన్నుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నామని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈఓపిఆర్డి శరత్ బాబు మాట్లాడుతూ చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మండలంలోని ఉన్నతంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. అనంతరం జీఎస్టీ పైన కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు గ్రామ పెద్దలు నాయకులు శివయ్య, అసిస్ట్ ట్రైనింగ్ అధికారి బొల్లయ్య, అసిస్ట్ సీవో అనిల్ కుమార్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు, వీఆర్వో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు గ్రామస్తులు యువత తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



మాట్లాడుతున్న డాక్టర్ హనుమంతరావు

పబ్లిక్ ప్రవేట్ పార్టనర్ షిప్ ద్వారా మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినంద నీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు అన్నారు. గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రం త్వరిత గతిన అభివృద్ధి చెందేందుకు ఈ విధానం సరియైనదన్నారు. దీనిపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, అవన్నీ తొలిగించుకోవాలని ఆయన సూచించారు. మెడికల్ కళాశాలలను ట్రిపుల్ పీ పద్ధతిలో అభివృద్ధి చేస్తే పేదలకు కార్పొరేట్ వైద్యం చౌకగా లభిస్తుందని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మా త్రమే ఈ వైద్య శాలలు నడుస్తాయి కాబట్టి పేదలకు ఇప్పుడున్న సౌక ర్యాలన్నీ ఉంటాయన్నారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పిం చబడతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఎంతో ముం దు చూపుతో ఈ పద్ధతి సృష్టించార న్నారు. గడువు పూర్తయిన తర్వాత ఆ ఆస్తులన్నీ ప్రభుత్వ పరమవుతా యి. కాబట్టి ప్రభుత్వానికి మేలు జరుగుతుందన్నారు. వైద్య శాలల్లో సీట్లు భర్తీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటుంది కాబట్టి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదన్నారు. దీనిపై ప్రతి పక్షాలు చెబుతున్నవన్ని అవాస్తవా లని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగాన్ని పాటించే వ్యక్తి సీఎం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా పాటించే ఏకైక నాయకులు సిఎం నారా చంద్రబాబు నాయుడని అంబేద్కర్ ఆశయ సాధన టిడిపి కూటమి ద్వారా సాధ్యమవుతుందని ఏపి ఎస్.సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ స్పష్టం చేశారు. నరసరావుపేట టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సాతులూరి కుమార్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా దేవలపల్లిలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని వైసిపి నేతలు ధ్వంసం చేసి టిడిపి కూటమి నేతలపై బురద చల్లడం తగదన్నారు. వైసిపి హయాంలో దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, దుగ్గిరాల కరుణాకర్, ఎంతో మంది దళిత మహిళలపై అత్యాచారాలు జరిగాయన్నారు. సమావేశంలో టిడిపి పల్నాడు జిల్లా ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు జి.పి.కుమార్, అధికార ప్రతినిధి సిహెచ్. బాలు, నియోజకవర్గ ఎస్.సి నాయకులు గిద్దల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కె.సునీల్, జిల్లా కార్యదర్శి జన్నలగడ్డ శ్యామ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





పౌష్టికాహారం అందజేస్తున్న ఆర్తిమళ్ల రమేష్

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి – పెదకూరపాడు

గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని టిడిపి జిల్లా కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్ గురువారం పంపిణీ చేశారు. జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని టిడిపి జిల్లా కార్యదర్శి రమేష్ సహకారంతో అందించారు. రమేష్ మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు దాసరి బెన్నిబాబు, ప్రతినిధులు అనిల్ కుమార్, పూర్ణచంద్ర రావు, బిసి చైర్మన్ వడ్లమూడి అప్పారావు పాల్గొన్నారు.







వినుకొండ, మాచర్ల, రాజుపాలెంలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

ప్రజాశక్తి – వినుకొండ

జీఎస్టీ తగ్గిండ పేదలకు వరమని ప్రముఖ టాక్స్ కన్సల్టెంట్ మంత్రిరాజు అండ్ కో సంస్థ మేనేజింగ్ కో డైరెక్టర్ మంత్రిరాజు కిషోర్ అన్నారు. గురువారం విశ్వసాయి జూనియర్ కాలేజిలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ ప్రజా సేవకులు భాగవతుల రవికుమార్, ప్రిన్సిపాల్ యడవల్లి శ్రీవల్లి పావని, డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – మాచర్ల

శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పదో వార్డులో జీఎస్టీ తగ్గించటం వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలన గురించి వార్డులోని ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డు టిడిపి మహిళా నాయకులు వేముల మంగమ్మ, చల్ల నాగమణి, 94వ బూత్ ఇంచార్జ్ గడ్డ అంజి, 11వ వార్డు కౌన్సిలర్ పూర్ణచంద్రరావు, జంధ్యాల సత్యనారాయణ, 63వ బూతు ఇన్‌చార్జ్ షేక్ జానీ బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి – రాజుపాలెం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని విలేజి హెల్త్ క్లినిక్‌లలో జీఎస్టీ తగ్గింపుపై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ వి. రవితేజనాయక్ తెలిపారు. సత్తెనపల్లి కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ మేనేజర్ కె. గోపాలరావు మాట్లాడుతూ పేద ప్రజలు ఉపయోగంచే వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించటం వలన ప్రజలకు డబ్బు ఆదా చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ వసంతరావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఎమ్.ఎల్.ఎచ్.పి.లు ప్రియదర్శిని, అలేఖ్య, లక్ష్మి దుర్గ, ఏ.ఎన్.ఎమ్ లు, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, అచ్చమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – కారంపూడి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాధారణ మందులు టెస్టింగ్ కిట్లు మొదలైన వస్తువులపై జీఎస్టీ తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శెట్టి హనుమంతరావు, టిడిపి నాయకులు లింగా. శ్రీనివాసరావు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కె.సుబ్బారావు, సూపర్‌వైజర్ కె.మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – క్రోసూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని వైద్యాధికారిని జాఫ్రీన్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, కమర్షియల్ టాక్స్ ఇన్స్పెక్టర్ చంద్రకాంత్ తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ తరపున అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కమర్షియల్ టాక్స్ ఇన్స్పెక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ మెడికల్ షాప్ యజమానులు తమ దుకాణాలు వద్ద మార్పు చేసిన జిఎస్టిని స్లాబుల వివరాలను బోర్డ్ ఏర్పాటు చేసి ప్రదర్శించాలని సూచించారు. వైద్యాధికారిని జాఫ్రీన్ మాట్లాడుతూ జీవిత, ఆరోగ్య భీమాకు టాక్స్ రద్దు చేయడంలో ఆ మేరకు వినియోగదారులకు భీమా సేవలు మరింత అందుబాటులో వచ్చాయన్నారు . ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు కాంద్రు కాశయ్య, అనుముల వెంకట్రామిరెడ్డి, దుద్దుల యోహాను, మెడికల్ షాపుల యజమానులు కటకం సీతారామ కోటేశ్వరావు, పి.కిరణ్ కుమార్, కె.శ్రీనివాస్ గుప్తా, హెల్త్ సూపర్వైజర్ శివుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి – యడ్లపాడు

స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిధిలో ఉన్న అన్ని సచివాలయాలలో గురువారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అనేక కరాలైన మందుల ధరలు తగ్గుతాయన, పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. సాధారణ మందులు ధరలతో పాటు ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, షుగర్, , గుండె సమస్యల తాలూకు మందుల ధరలు గణనీయంగా తగ్గాయని వివరించారు. ఈ కార్యక్రమాలలో మండల వైద్యాధికారి, ఆయా గ్రామాల పెద్దలు, మండల వైద్య ఆరోగ్య ఉన్నత అధికారులు ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రంప్ ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు



మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై విధించే శుంకాలను వ్యతిరేకించాలని, ప్రధాని మోడీ అవలంబిస్తున్న లొంగుబాటు విధానంపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. ట్రంప్ సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అధ్యక్ష వహించారు. రామారావు మాట్లాడుతూ ట్రంప్ విధించిన శుంకాల వలన భారత దేశంలో రొయ్యలు, చేపలు, పత్తి, వస్త్ర వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని,శుంకాలను వ్యతిరేకించాలని అన్నారు. దీనివలన ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టం జరుగుతుందని అన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం వలన ట్రంపు బెదిరింపు ధోరణలకు పాల్పడు తున్నారని అన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా బహుళ ధ్రువ ప్రపంచ దిశగా విదేశీ విధానం ఉండాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. వీటిపై ఈనెల 17వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు పేద ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ వ్యవస్థలోని అన్నింట్లోనూ ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు ఉన్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో భారత రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకు న్యాయవస్థకు తూట్లు పొడిచేందుకు బిజెపి చూస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని మోడీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ ఉద్యమించాలని అన్నారు. సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు కోసం ఈనెల 13, 14,15 తేదీలలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమంలో పేద ప్రజలు పెద్ద సంఖ్యల హాజరై జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరి పట్టణంలో తాగునీరు సక్రమంగా అందడం లేదని అన్నారు. సదస్సులో సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, పి.బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ, పట్టణ కమిటీ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, ఎస్.గణేష్, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వివిఐటిలో అమేయా 2కే25 సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి - పెదకాకాని

నంబూరు గ్రామంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి మెకానికల్ ఇంజనీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు అమేయా -2కే25 సాంకేతిక వేడుకలను ఏపి జన్‌కో సూపరిడెంటింగ్ ఇంజనీర్ కె.బాలకృష్ణ గురువారం ప్రారంభించారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సదస్సులో జిగ్ టెక్ పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్.సీ కార్నేబీ, పిక్టో, క్రిక్ క్విజ్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించనున్నారు. వేడుకలకు వివిధ సాంకేతిక కళాశాలల నుండి 1800 మంది విద్యార్థులు పాల్గన్నారు.ఈ సందర్భంగా కె.బాలకృష్ణ మాట్లడుతూ సాంకేతిక సదస్సులలో పాల్గొనడం ద్వారా పోటీతత్వం, అధునాతన సాంకేతిక విధానాలు అలవరుతాయని అన్నారు. విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, సంధానకర్త వి.కిరణ్ కుమార్, సేమ్ విద్యార్థి విభాగం సభ్యులు ఎమ్.పవన్ సాయి, సిహెచ్ విష్ణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకే సమ్యక్ 2025



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ 2025 వేడుకలను వడ్డేశ్వరంలోని గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లో శుక్ర, శనివారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవి నాయుడు, విశిష్ట అతిథులుగా ఫెనామ్ ఇంక్ హెచ్.ఆర్, టిఎ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పిండి, వ్యవస్థాపకులు, చలనచిత్ర నిర్మాత కోనేరు నిఖిల కార్తికేయన్ లు హాజరు కానున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా23 రాష్ట్రాల నుండి ఆయా కళాశాలలు, యూనివర్సిటీ లకు చెందిన సుమారు 25 వేలకు పైగా విద్యార్థులు ఈ సాంకేతిక సదస్సుకు హాజరయి ఆవిష్కరణలు, పరిశోధనలు, పరిశ్రమల-విద్యా సహకార పండుగను జరుపుకోనున్నారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలిపారు. సమ్యక్ 2025 చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాధ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ బిటిపి మాధవ్, సమ్యక్ 2025 కన్వీనర్లు ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ వి.రాజేష్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, ఎఫ్ఇడి ప్రిన్సిపల్ డాక్టర్ వి.కృష్ణాష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







ఎఎన్‌యూలో అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ రామినేని శివరామప్రసాద్, పొన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, తెనాలిలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఆర్థిక క్రమశిక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో విద్యాసంస్థలు ముందుండాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ రామినేని శివరామ ప్రసాద్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామినేని మాట్లాడుతూ జీఎస్టీ 2.0 పారదర్శకత, సరళత వంటి అంశాలు యువతలో ఆర్థిక అవగాహన పెంపు దిశగా కీలకమైన అడుగు అని పేర్కొన్నారు. ప్రధాన అతిథులుగా డి. శివప్రసాదరావు, సహాయ కమిషనర్, జీఎస్టీ, మంగళగిరి, సాయి శంకర్ లండా, డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (భారత ప్రభుత్వం) హాజరయ్యారు. ప్రొఫెసర్ సింహాచలం (రిజిస్ట్రార్), ప్రొఫెసర్ లింగరాజు (ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్), డాక్టర్ ఎం. గోపీకృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి (అసిస్టెంట్ ప్రిన్సిపల్స్) కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఇందిరానగర్ యూపీహెచ్సీలో గురువారం హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టి, సూపర్ సేవింగ్‌పై రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పెదవడ్లపూడి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయపాటి రమేష్, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ తేజస్వి, డాక్టర్ విక్రమ్, ఎల్బీనగర్ సచివాలయం అడ్మిన్ అనిల్ పాల్గొన్నారు.

కొపురావుకాలనీలో..

పట్టణంలోని కొప్పురావు కాలనీలోని యు పి హెచ్ సి సెంటర్లో, రత్నాల చెరువులోని భావన ఋషి ఆలయం వద్ద సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఆలిం బాషా, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ పద్మనాభం, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.భూలక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షులు పి.మహేష్, టిడిపి నాయకులు షేక్ రియాజ్, యుపిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని డాక్టర్ ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించడం జరిగింది.. ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా పేదలకు మెరుగైన సేవలు అందిం చటం వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న చంద్రకళ పీజీ కళాశాల, కెఎస్ఆర్ అండ్ కె ఆర్ కె కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఎన్ఆర్‌కె అండ్ కె ఎస్ ఆర్ గుప్తా ఫార్మసీ కళాశాలలో గురువారం జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో అత్తోట దీప్తి, తేలప్రోలు పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి జె.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నరేష్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆసియా, మేనేజర్ డి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.శ్రీనివాస నాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

310వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

చట్టపరంగా తమకు రావాల్సి బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 310వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కె.స్టీఫెన్, షేక్ సుభాని, ఎం.ఆశీర్వాదం ప్రారంభించారు. దీక్షల్లో బండ్ల శివకుమారి, షేక్ ఇమాంభి, దామవరపు సువర్ణకుమారి, డేరంగుల రమణమ్మ, ఉప్పు కాశమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై. సాంబశివరావు, తుపాకుల నాగేశ్వరావు, డి.నాగేశ్వరావు, గురవయ్య,కొండ, శరమ్మా, శివకుమారి, రిబ్కా, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన యార్లగడ్డ పద్మావతికి స్థానిక టిడిపి, జనసేన నాయకులు ఎల్‌ఓసీ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలు వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టకున్నారని, మంజూరైన ఎల్‌వోసీ చెక్కును మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు గురువారం ఆమెకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు మేకల రాజా, టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, జనసేన నాయకులు పసుపులేటి అశోక్, శేషంశెట్టి శ్రీనివాసరావు, మున్నా శ్రీను,కొవ్వూరి సురేష్, తోటకూర ప్రవీణ్, అట్లూరి గోపి, నంగెడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

నులకపేట ఆటో యూనియన్ ఆఫీస్ వద్ద ప్రగతిశీల కార్మిక సమాఖ్య, మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్లు సంయుక్తంగా గురువారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికులను, రైతులను, ఆదివాసీలను అణిచివేస్తూ, పైశాచిక ఆనందం పొందుతున్నాడని విమర్శించారు మతోన్మాద ఫాసిస్టు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిస్తూ కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి జాన్ సైదా, కాలేశ్వరావు మార్కెట్ యూనియన్ ప్రెసిడెంట్ ఖాసిం, ఉపాధ్యక్షులు బాలు, కమిటీ మెంబర్ కె.విజయబాబు, కె.ఎర్రశ్రీను పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

తాడికొండ - అక్టోబర్

పశుసంవర్ధక శాఖ, ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో మండలంలోని కంతేరు గ్రామంలో గురువారం పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంను తెలుగుదేశం నాయకులు వాసిరెడ్డి జయరామయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, ఏడి రాయపరెడ్డి, పశు వైద్యులు జ్యోతి దేవి, రవితేజ, బండ్ల కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

17వ తేదీలోగా బాణసంచా షాపులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గుంటూరు

దీపావళి పండగకు బాణాసంచా విక్రయించే షాపుల అనుమతులకు ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. 20న దీపావళి పండగకు తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకోవటానికి అనువైన ఖాళీ ప్రదేశాలను గుర్తించాలని అధికారులను ఇప్పటికే ఆదేశించడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా విక్రయదారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ కోరారు. ప్రజలు లైసెన్స్ ఉన్న వారి నుండే కొనుగోలు చేయాలని, వినియోగాన్ని పెద్దలు పర్యవేక్షించాలని, నీటిని అందుబాటులో ఉంచుకోవటం, ఏరియల్ బాణసంచాను సురక్షిత ల్యాండింగ్ జోన్‌లో ఉపయోగించటం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల మధ్య శబ్దాలు వెదజల్లే బాణసంచా పేల్చవద్దని తెలిపారు.

జిఎస్‌టిపై ఆర్‌విఆర్ జెసిలో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు



పోటీల్లో గెలుపొందిన విద్యారులతో ప్రిన్సిపాల్ తదితరులు

భారతదేశ పన్నుల చరిత్రలో జిఎస్‌టి 2.0 గొప్పమైలు రాయిగా నిలుస్తుందని జిఎస్‌టి వంటి పన్ను సంస్కరణలు దేశ ఆర్థిక స్థిరత్వానికి మూలస్థంభమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని అన్నారు. ఆర్‌విఆర్ జెసిలో గురువారం విద్యార్థులకు జిఎస్‌టి 2.0 పన్ను సంస్కరణలపై అవగాహన కల్పించేందుకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షైక్ ఆర్షియా ప్రథమస్థానం, ఎల్. కార్తికేయ ద్వితీయ స్థానం, ఎన్.సహస్ర తృతీయ స్థానం సాధించగా వారికి బహుమతులు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ తదితరులు

పక్షవాతంపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 29న ప్రపంచ పక్షవాత దినం పురస్కరించుకొని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అక్టోబర్ నెలను పక్షవాత అవగాహన మాసంగా నిర్వహిస్తున్నట్లు ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ తెలిపారు. పక్షవాతంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీవాత్సవ, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాష్, లలితా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ గురువారం ఆవిష్కరించారు. దీజుఖీూాూ ద్వారా పక్షవాత లక్షణాలను గుర్తించే విధానం, గోల్డెన్ అవర్ (4గంటల 30 నిమిషాలు) ప్రాధాన్యత, పక్షవాతంకు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సల గురించి వివరించే ఈ పోస్టర్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తామన్నారు. .ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రదర్శిస్తామన్నారు. ప్రజల్లో పక్షవాత లక్షణాలపై అవగాహన పెంచి, తొందరగా గుర్తించి సమయానికి చికిత్స పొందడం ద్వారా అంగవైకల్యం, మరణాలను తగ్గించడం ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. పక్షవాత నిర్ధారణకు అవసరమైన సిటి స్కాన్ పరీక్షలు, ఐవి థ్రాంబోలైసిస్ కోసం అవసరమైన క్లాట్ బస్టింగ్ ఔషధాలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కానీ ప్రధాన అడ్డంకి పక్షవాత లక్షణాలను ఆలస్యంగా గుర్తించడం, స్ట్రోక్ రెడీ ఆసుపత్రికి సమయానికి చేరుకోకపోవడమేనని అన్నారు.



సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న రాయపాటి శ్రీనివాస్ తదితరులు

జెకెసి కాలేజీలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజిలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు మూడ్రోజులపాటు నిర్వహించనున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ గురువారం ప్రారంభం అయ్యింది. ముఖ్య అతిథిగా కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కళాశాలలోని లైబ్రరీ, ప్లేగ్రౌండ్, ల్యాబ్‌లు, ఇతర అన్ని సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులు తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని అన్నారు. కళాశాల సెక్రెటరీ జాగర్లమూడి మురళీమోహన్ కళాశాల చరిత్ర గురించి వివరించారు. ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ కళాశాల లోగో గురించి నిబంధనల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు డాక్టర్ గోపీచంద్, కె.రామారావు, పి.జి కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె.ప్రసాద్, అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రసంగించారు.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-గుంటూరు



ఖరీఫ్ సీజన్ 2025 -26లో ధాన్యం సేకరణపై గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అవగాహన, శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతుసేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం (కామన్) క్వింటాల్ (100కిలోలు) రూ.2369లు, 'ఎ' గ్రేడ్ రకం క్వింటాలు రూ.2,389లుగా నిర్ణయించినట్లు చెప్పారు. గత సంవత్సరం మద్దతు ధర కన్నా ఈ సీజన్‌లో రూ.69లు అధికంగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. గ్రేడ్ 'ఎ' రకం ధాన్యంకు వ్యర్థ పదార్థాలు, రంగుమారిన ధాన్యం, కుచించుకుపోయిన ధాన్యంగింజలు, తక్కువ శ్రేణివి, తేమ పరీక్షలు వంటి ఐదు రకాల పరీక్షలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సంక్షేమ హాస్టల్స్‌కు గుంటూరు జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసుకొని ధాన్యం సేకరణ చేయనున్నట్లు తెలిపారు.17 శాతం కంటే తక్కువ తేమ శాతం ఉండేలా టెక్నికల్ అసిస్టెంట్లు చూడాలన్నారు. ఏ రైతు కూడా కనీస మద్దతు ధర కన్నతక్కువకు అమ్ముకోవలసిన పనిలేదని, రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. రైతు తన పంటను ఇ పంటలో నమోదు చేసుకొని ఈకెవైసి పూర్తి చేసిన రైతుల వద్ద నుండే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం వెరైటీలు చేసేటప్పుడు విఎఓలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులకు 40 కేజీల గోనె సంచులు (గన్నీ బ్యాక్స్) 4.74కి అందించడం జరుగుతుందన్నారు. టెక్నికల్ సిబ్బంది కళ్ళాల వద్దకే వచ్చి నాణ్యతను పరిశీలిస్తారని, ధాన్యం సేకరించే ప్రతి రైతు వద్ద నుండి బయోమెట్రిక్ (వేలిముద్రలు) సంబంధిత రైతు సేవ కేంద్రంలో రైతు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిపిఎస్ అమర్చిన వాహనం ద్వారా రైతు కోరిన మిల్లుకు ధాన్యం పంపించడం జరుగుతుందని, ఒకేసారి ఇద్దరు, ముగ్గురువి కలసి ఒకే వాహనంలో ఒకే మిల్లుకు పంపించడం కూడా జరుగుతుందన్నారు. రైతుల బ్యాంకు అనుసంధారిత బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుంద న్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ తులసి మాట్లాడుతూ ధాన్యం విక్రయించుటలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, ఫిర్యాదు చేయటానికి టోల్‌ఫ్రీ నెంబర్ 1967లో ఉదయం 08.00 గంటల నుండి సాయంత్రం 07.00 వరకు సంప్రదించవచ్చన్నారు. అలాగే జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 9491392717 లో కూడా సంప్రదించ్చవన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి వీరాచారి, జిల్లా సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండ్లమూడి వెంకయ్య చౌదరి, తహాశీల్దార్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

వికలాంగుల రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలి

సంతోష్ కుమార్ రుంగ్టా

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్ రుంగ్టా, ఎన్ రంగయ్య, లక్ష్మణరెడ్డి తదితరులు

భారతదేశంలో వికలాంగులకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను ప్రతి కేటగిరీలో సమాంతరంగా కాకుండా మొత్తం మీద నాలుగు శాతం రిజర్వేషన్ అమలయ్యే విధంగా చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ప్రపంచ అంధుల సంఘం అధ్యక్షులు సంతోష్ కుమార్ రుంగ్టా విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత సహాయకులతో అంధులు దశాబ్దాల నుండి పోటీ పరీక్షలకు హాజరవుతుండగా నేడు సాంకేతిక నైపుణ్యాన్ని, కంప్యూటర్లను వినియోగించి అంధులు తమకు తాముగా స్వయంగా పరీక్షలు వ్రాయాలనడం భావ్యం కాదని పేర్కొంటూ అంధులందరూ కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతికత అందిపుచ్చుకున్నప్పుడే ఈ విధానం సాధ్యపడు తుందని, అప్పటివరకు రాత సహాయకులను ఉపయోగించుకునే వెసులుబాటును కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అంధుల పట్ల చూపే జాలి, దయ, దాతత్వాల కంటే వాళ్లకు సమాన అవకాశాలు, నైపుణ్యాలను అందించాలని కోరారు.జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పబ్బరాజు వేంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ స్మారక మానవ సేవా జాతీయ పురస్కారం అందుకుంటున్న సంతోష్ కుమార్ రుంగ్టా అంధుల జీవితాలలో వెలుగులు నింపేందుకు గత మూడు దశాబ్దాలుగా అవిరళ కృషి జరిపారన్నారు. ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య మాట్లాడుతూ నేడు ఉదయం 10 గంటలకు గుంటూరు, రెవెన్యూ కల్యాణ మండపంలో పబ్బరాజు వేంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి స్మారక మానవ సేవా జాతీయ పురస్కారాన్ని అందచేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రస్ట్ చైర్ పర్సన్ ఆనంగి పూర్ణచంద్రరావు, వైస్ చైర్‌పర్సన్ ఉప్పలపాటి మధుసూధనరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి ప్రసంగించారు.

అనధికార నిర్మాణాలపై ఫిర్యాదు చేయండి

నగర కమిషనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలను, లేఅవుట్లను ఉపేక్షించబోమని, ఎక్కడైనా అనధికార నిర్మాణాలు జరిగితే ప్రజలు నేరుగా కమిషనర్ పర్యవేక్షణలో ఉండే 98499 08391 నంబర్‌కి వాట్సప్ ద్వారా తగిన ఆధారాలతో(ఫొటోలు, వీడియోలు) ఫిర్యాదు చేయవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో నిర్మాణాలు జిఎంసి నుండి నిర్దేశిత అనుమతులు పొందిన తర్వాతే చేపట్టాలని, అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తే నిర్మాణాన్ని కూల్చివేయడంతోపాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే భాధ్యులైన సిబ్బంది, అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. అనధికార నిర్మాణాలు, లే అవుట్లపై ఫిర్యాదులు స్వీకరణకు ప్రత్యేకంగా కమిషనర్ చాంబర్లోని 9849908391 నంబర్‌ని కేటాయించా మన్నారు. సదరు ఫిర్యాదులను నేరుగా తామే పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ నిర్మాణ, లే అవుట్ల అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే నిర్దేశిత గడువులోపు మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నగదు రహిత చికిత్స సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో నగదు రహిత వైద్య చికిత్సను పూర్తిస్థాయిలో అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష కోరారు. గురువారం సంఘం నాయకులు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. నెట్వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి, పకడ్బందీగా నగదు రహిత వైద్య చికిత్సను అందించే విధంగా కృషి చేయాలని కోరారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ సానుకూలంగా స్పందించి, హాస్పిటల్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు యు.సుమిత్రాదేవి, జిల్లా సంయుక్త కార్యదర్శి, కోటాసాహేబ్, వి.కార్తీక్, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.